# దొంగవాళ్ళు

"ఎవరయ్యా నువ్వూ?" ఒక పార్కులో మూల బెంచీమీద కూచున్న ఆ మాసిన మనిషి అడిగాడు. ప్రశ్నిస్తున్న మొహంతో తనకెదురుగా వొచ్చి నుంచున్న మనిషిని గమనించి.

"నీకు దగ్గరవాణ్ణి!" అన్నాడా వొచ్చి నుంచున్న మాసిన రెండో మనిషి, బెంచీ మీద కూచునున్న మాసిన మనిషిని ఆప్యాయంగా చూస్తూ.

ఆ వొచ్చి నుంచున్న మాసిన మనిషికి ఉంగరాల క్రాపూ, పాతికంగుళం పెరిగిన గడ్డం, పేంటూ, స్లాకూ అన్నీ షుమారుగా మాసుంటే, బెంచీమీద కూచున్న మనిషికి అంగుళం మోతాదు గడ్డంతో అంతకు రెట్టింపు అన్నీ మాసి వున్నయి.

"నీ వాలకం నాకేం బాగాలేదు! యింకెవరి దగ్గిరికన్నా చేరి వాళ్ళను పట్టు ఏమన్నా రాలొచ్చు - నా దగ్గిరేం వుంది బూడిద చివరకు నేనా నీకు దొరికింది?" అని ఆరిపోయి యింకో అంగుళం మిగిల్న బీడి ముక్కను మళ్ళీ ముట్టించాడు, బెంచీమీద మాసిన మనిషి.

"నువు నా కళ్ళకు కొట్టొచ్చినట్టు కనపడ్డంతగా యీ పార్కులో వున్న యింకో వ్యక్తి అంత నదురుగా నా కంటి కాన్లేదు. నిన్నంత దూరాన్నుంచే జూచి నువు నా మనిషివని గ్రహించి వొచ్చా- నీకేమన్నా అభ్యంతరమా?" అంటూ ఆ రెండో మాసిన మనిషి ఓ మాసిన జేబురుమాల్తో ఆ బెంచీ దులిపి, మాసిన ఒకటి ప్రక్కన కూచుని, ఆ జేబు గుడ్డను అతి భద్రంగా దులిపి జేబులో పెట్టుకుని - ఏనాడో పోగొట్టుకున్న ఆప్తుడు దొరికినట్లు - తన పక్క కూచున్న మాసిన మనిషిని ప్రేమభరితంగా చూడసాగాడు.

'నన్నా రకంగా చూడ్డంలో నీ వుద్దేశ్యమేమిటి? కిందటి జన్మలో కూడా నిన్ను నే నెరిగినట్టు లేదే! నన్ను వొదులు నీకు పుణ్యం వుంటుంది!" అన్నాడు మాసిన ఒకటి, బెంచీమీద కొంచెం పక్కకు జరుగుతూ.

"పుణ్యం, పాపం అనే మాటలు నాకుగిట్టవు. ఆ మాటలనేది దగుల్బాజీలు. నువు దగుల్బాజీవా?" అడిగాడు మాసిన రెండు.

"మరీ అవసరం అనుకుంటే తప్ప మాటల అర్థాల్ని అట్టే పాటించడం నేనెప్పుడో వొదిలేశా! నాకు వున్నది గట్టి, లేంది లేదు!" అన్నాడు మాసిన ఒకటి.

"నా అంచనాలో అణువంత తప్పులేదు! మనిద్దర్దీ ఒకేతరగతి! మార్కులు కూడా సమాన తూకంలో వుంటయ్యని నావూహ. యిక ముందు ఏలాంటి అసాధ్యమైన పని సాధించడం జరిగినా అది మనిద్దరి ఘనకార్యమని నువు నిరభ్యంతరంగా జమకట్టుకో! యిహ చెప్పు-" అన్నాడు మాసిన రెండు, మాసిన ఒకటి చెయి తన చేతిలోకి తీసుకుని మృదువుగా నిముర్తూ.

"నీది పోలీసు జాతా? వాళ్ళను గురించి నాకు కొద్దిగా తెలుసులే!" అన్నాడు మాసిన ఒకటి - తన చేతిని లాగేసుకుంటూ.

"పాప ముపసంహరింప బడుగాక! పోలీసు జాతి పేరెత్తుతే నా వొళ్ళంతా వానపాములు పాకుతున్నట్టు వుంటుంది. వాళ్ళు వుండవలసిన తీరుగా కాకుండా ఏదో దోషగుణం తగిల్న వాళ్ళల్లే నా కంటికన్పిస్తారు. నీ కంటికి నేను ఆ జాతి తాలుకు వాణ్ణిగా కనుపించడం నూరు పాళ్లూ శాస్త్ర సమ్మతమైందికాదు. ఎందుకంటే వృత్తుల్ని బట్టి మనుషుల మొహాలు మూసపోసినట్టు ఒక రూపానికి తేల్తయి. బహుశ నీ కళ్ళు బెదిరుంటంవల్ల నాతీరు నీకు సూటిగా తగిలుండదు" అన్నాడు మాసిన రెండు.

"ఇదిగో లెక్చర్లు కొట్టి విసిగిన ప్రాణం నాది. నువు నన్నో పద్ధతిలోకి లాగదల్చుకుంటే అదీ తేల్చుకుని నీ దార్న నువు పో!" అన్నాడు మాసిన ఒకటి.

"మనం ఒకళ్ళ కిద్దరం కలిసుంటే కలిగే సత్ఫలితాల్ని నువు తోసెయటంలో యిద్దరు ప్రాణులు నష్టపడ్తున్నారు. నేను సూచించినది వుభయతారకంగా కూడా భవిష్యత్తుకు శ్రేయస్కరమని నా సలహా" వినయపూర్వకంగా అన్నాడు మాసిన రెండు.

"అంటే నీ అంచనా, నేను దార్న పొయ్యే బికారి వాళ్ళనల్లా పోషించగలిగే తాహతు గల వాణ్ణనా? నేనిప్పుడే ఓ పాతిక ఎంగిలి బీడీని తాగుతుండడం నువు గమనించి వుంటావు - సూక్ష్మగ్రాహివవుతే!" అన్నాడు మాసిన ఒకటి.

"ఇలాంటి పొదుపు వుద్యమంలో నాతో పోటీకొస్తే నువు ఓడటం ఖాయమని రాసిస్తా! నువు అంగుళం బీడీని సేకరించి నాలుగు దమ్ములు కొట్టి పారేస్తే నేను అంతే పొడవు సిగరెట్టును ఎనిమిది భాగాలుగా విభజించి రోజుకు రెండు మోతాదుల చొప్పున నాలుగురోజులు సేవించా; తేడా ఏమిటంటే- అది-నా సొంత సిగరెట్టు గనుక నువు నన్నాదుకునే ప్రశ్నే లేదు. యింక మిగిలిందల్లా నన్ను ప్రత్యక్ష కార్యరంగంలో పరీక్షించటమే" అన్నాడు మాసిన రెండు.

"ఉండు–కొంచెం గుక్కతిప్పుకుని నన్ను సవ్యంగా ఆలోచించుకోనీ–" అన్నాడు మాసిన ఒకటి.

* * *

అదొక పెద్ద భవనం. చుట్టూ పెద్ద తోట వుంది. కార్లున్నయి. మూడు టెన్నిస్ కోర్టులున్నయి. యీత లీదుకునేందుకు పెద్ద స్విమ్మింగుపూలున్నది. నౌకర్లున్నారు, కుక్కలు కూడా వుంటంలో తప్పులేదు. యివన్నీ వున్నవాళ్ళ కెంతన్నా వుంటుంది.

ప్రహరీగోడ దూకి తోటలోంచి ఆ భవనం ఉత్తరపు దిక్కున మావిడిచెట్టు కింద కొచ్చి నుంచున్నారు యిద్దరు మాసిన మనుషులు అర్ధరాత్రి చీకట్లో.

"ఇదే యీ భవనానికి ఉత్తరపు దిక్కు. డబ్బుంటే యినప్పెట్టెలు ఉత్తరపు దిక్కునే వుంటయి" అన్నాడు మాసిన ఒకటి గుసగుసగా.

"ధనాధిపతైన కుబేరుడు ఉత్తరదిశకు దిక్పాలకుడు. డబ్బు మురుగుతున్న ప్రతి ధనిక వెధవాయి తమ ధనానికి కుబేరుడు రక్షకుడుగా వుంటాడని నమ్మి చస్తారు!" చెప్పాడు మాసిన ఒకటి.

"మనకు ముఖ్యమైన పన్లున్నవారిని గౌరవవాచకంతో సంబోధించటం సబబు; కాని నీ వాస్తు జ్ఞానం కొంచెం లోతయిందే!" అన్నాడు మాసిన రెండు.

"చచ్చింది! చిన్నప్పుడు 'పెద్దబాలశిక్ష'లో కావాల్ను 'ఉత్తరమున కుబేరుడు' అని చదివినట్టు జ్ఞాపకం వచ్చింది సమయానికి. కాని యీ న్యూఏజ్ రిచ్‌కి పాతబాపతని మన వాస్తుశాస్త్రం గిట్టకపోతే మటుకు మనం ఔట్!" అన్నాడు మాసిన ఒకటి.

"ఉత్తరదిక్కున ధనస్థానమైతే వంటగది స్థానం ఏ దిక్కున వుంటుందో ఆ పెద్దబాల శిక్షలోనే రాసి వుంటారేమో నీ జ్ఞాపకశక్తి కేమైనా అందుతుందా?" అడిగాడు మాసిన రెండు.

"నువిప్పుడు వంటగది ప్రస్తావన ఎందుకెత్తినట్టు?" అడిగాడు మాసిన ఒకటి అనుమానంగా.

"నాకు ఆకలి దహించుకుపోతున్నది. కడుపెంత అంటుకుపోయిందో చూస్తావా!" అని స్లాకు పైకెత్తాడు మాసిన రెండు.

"ఒద్దు ఒద్దు– నీ మాటంటే నాకు పూర్తి నమ్మకం వుంది. అసలు మనం ఏ ప్రధాన కర్తవ్యంతో యిక్కడికి చీకట్లోపడి వొచ్చామో బహుశ నీకు గుర్తుందనుకుంటా?" అన్నాడు మాసిన ఒకటి.

"నీకు మన వుద్దేశాలు ఒకటవడంలో ఆవగింజంత సందేహం వుందని తెలిసినా నేను చచ్చేట్టు బాధపడ్తా! కాని ముఖ్యంగా మానవుడేం చేసినా ముందు కడుపు కక్కుర్తికోసం చేస్తాడని నీకు తట్టకపోవడం నా కాశ్చర్యంగా వుంది! మనం యీ వుత్తరదిక్కు గదిలో కొంత ధనసేకరణ చేసి, యిక్కణ్ణుంచి బయటపడిన వెంటనే ముందు మనం చేసే పనేమిటి? ఎకాఎకిని తెరిచున్న ఏ కాఫీహోటల్లోకో జొరబడి పది ఇడ్లీ, అరడజను పెసరట్లు, నాలుగు మినపట్లూ, నాలుక్కప్పులు స్పెషల్ కాఫీ పుచ్చుకుంటాం అని నువు ఒప్పుకుంటావా? అయితే కాఫీ హోటలు సరుకు! యీ ధనికుల యింట్లో అంతకన్న రుచిగల సరుకు లభ్యమౌతుందనడంలో నీకు సందేహం వుందా? సూక్ష్మంలో మోక్షమని ధనసేకరణతోపాటు వంటగది పనికూడా మనం ముగించుకుంటే సూటిగా మన మకాంకు వెళ్ళి సుఖనిద్ర పోవచ్చు!" అన్నాడు మాసిన రెండు.

"నీ ఆలోచన్లో దుర్లక్షణాలు లేవని వొప్పుకున్నప్పటికీ - ప్రధాన కర్తవ్యాన్ని మనం తలకిందులుచేసి చూస్తున్నామా-అనే నా సందేహం!" అన్నాడు మాసిన ఒకటి.

"సందేహం అనే అంశం ఎప్పుడూ ద్వితీయ స్థానంలో వుంటుంది! కొంచెం వుండు - చిన్నప్పుడు మా తాతయ్య మా నాయనమ్మతో 'వంట గది ఎప్పుడూ యీశాన్యాన వుంటం శ్రేష్టమని' వాదించటం యిప్పుడు జ్ఞాపకం వొస్తున్నది! గనుక వంటగది యీ ఉత్తరపు గదులకు వెనుక పక్కగానే వుంటుందనడంలో సందేహం లేదు! పద - ఏమిటా చప్పుడు-?"

మాసిన మనుషుల కెదురుగా మొదటి అంతస్తు ఉత్తరదిక్కు గది బాల్కనీ తలుపు గభాల్న తెరుచుకుని - బాల్కనీ రైలింగు దగ్గిర కొచ్చి నుంచున్నారు ఒక పురుషుడు, ఒక స్త్రీ ఆ అర్ధరాత్రి వేళ.

"మీకేమన్నా మతుందిటండీ - యీ కేకులు, స్వీట్సు కుళ్ళ పెడ్తానంటారు? మన టామీ, జానీలకు పడేస్తే అవి నిక్షేపంగా తింటాయ్ - టామీ, జానీ-" అనా స్త్రీ పిలిచింది.

"మనం రెండో ఆట సినిమాకు వెళ్లేముందేగా వాటికి కడుపునిండా పెట్టామూ? వాటికి అజీర్తి పట్టుకుంటే ముందు నేను రేపు ఆఫీసు సెలవుపెట్టి ఆ కుక్కల స్పెషలిస్టును పట్టటానికి వూరంతా గాలించమనా నువంటం?" అంటున్నాడు పురుషుడు, నిస్పృహాయంగా.

"మీరలా అంటం మరీ బావుంది! అయినా వాటికి అజీర్తి చేస్తే చూస్తూ చూస్తూ నిక్షేపమంటి కుక్కల్ని చంపుకుంటార్టండీ - ఎంత మతిలేని వాళ్ళయినా? అయినా మీరు

పడే కష్టాలు చూళ్ళేక కళ్ళు వాచిపోతున్నాయిగానీ – మీకంత శ్రమ కలగనియన్లెండి – ఆ కుక్కల డాక్టరుకు మన నౌకరు వెంకాయి చాలు, పిలవటానికి – అంతదాక వస్తే! వుండండి – కాస్త కడుపు నిండుతే కుక్కలకన్నా విశ్వాసం వుంటుంది, మన కొంప మీద – టామీ, జానీ–" మళ్ళీ పిలిచింది స్త్రీ.

ఎక్కణ్ణుంచో రెండు బలిసిన కుక్కలు తోకలాడించుకుంటూ బాల్కనీ కింద కొచ్చినై కాని అందులో ఒక కుక్క ఎవరో నెత్తిన మొట్టినట్టు – వెనక్కు తిరిగి మాసిన యిద్దర్నీ గమనించి 'బౌవ్' అనరిచింది.

"ఆ కుక్క చచ్చింది మనల్ని చూసి చచ్చింది పరుగెత్తు–" అనరిచాడు మాసిన రెండు చెవిలో, మాసిన ఒకటి.

"చెవిలో అరవకు – వుండు చూడ్నీ – ఆ కుక్క చచ్చింది అక్కడ్నుంచునే అరుస్తున్నది గాని మనవేపు రావడం లేదు – గమనించావా? ఆ రెండో కుక్క తనకు బాహ్య విషయ ప్రసక్తేమీ పట్టనట్టు – ఎగబడి ఆ కేకులు స్వీట్లన్నీ ముందే తినేస్తున్నది! అలా లడ్డు, జిలేబి, కేకులు తినడం – పాపం! ఫలితం అవి మొరుగుతైగాని కరవ్వు! యిలాంటి కుక్కలు దొంగలకు మహాప్రీతి!" పరిశీలనా దృష్టితో అన్నాడు మాసిన రెండు.

"నీకు శునక శాస్త్రంలో కూడా పాండిత్యం వుందని నాకు తెలిసే అవకాశం లేదు! ఏ క్షణాన్నైనా వాటికి పూర్వస్మృతులు గుర్తొచ్చినైయ్యంటే పాలసీ కన్నా మన మీద పడిపీకుతై! వాటికాస్పృహ రాకముందే మనం త్వరలో చిత్తగించడం మంచిది–పద–"

"ఆ చెట్టుకిం దెవరో కదుల్తున్నట్లున్నదండీ" పురుషుడి జబ్బ పట్టుకుని అన్నదా స్త్రీ.

"చాల్లే వూరుకో – చీకటంటే నీకసలే గిట్టదు! ఆకు కదిల్నా చావే నీతో – చస్తున్నా! అయినా యీ విషయం మనదాకా ఎందుకూ– అక్కడ నిజంగా ఎవరైనా వుంటే మన టామీ, జానీలు వాళ్ళను చీల్చి చెండాడేస్తయ్ – లోపలికి పద నిద్రముంచుకొస్తున్నది–" అని స్త్రీ నడుం చుట్టూ చెయి బిగించాడు, పురుషుడు.

"అవున్లెండి – మనకన్న ఆ కుక్కలే నయం! పదండి లోపలికి–"

బాల్కనీ తలుపు మూత పడ్తుండగా ప్రహరీ గోడ దూకి అవతల పడ్డారు, మాసిన మనుషులు.

మాసిన మనుషులిద్దరూ చేరింది, పక్కనే యింకో స్థితిమంతులల్లే వున్న వారి ఆవరణలోకి.

"యీ ఆవరణ, యీ యిల్లు వాలకం చూస్తుంటే యింటివారు మనవారల్లేనే వుందే?" అన్నాడు మాసిన ఒకటి, చుట్టూ పరీక్షిస్తూ.

"ఆట్టే చూస్తే యివాళ మనకేదో మంచియోగమే ఉన్నట్టుంది!" అన్నాడు మాసిన రెండు.

"ఉత్తర దిక్కు అటుంది. యీసారి యింటి వెనక వేపు నుంచి వెళ్దాం పద-" అని యింటి వెనక పక్కగా చుట్టు తిరిగి వెళ్తున్న మాసిన మనుషులు యింటికి ఉత్తర దిక్కు దిగువ మూలకు చేరగానే మాసిన రెండు మాసిన ఒకటి చేయి పట్టుకుని ఆపాడు.

"యీ యింటి వాళ్ళకు వాస్తు శాస్త్రం పట్టింపు వుందంటావా?" అడిగాడు మాసిన రెండు.

"యిదిగో నేస్తం, మనకు తెలియని పన్లు ఏం చెయ్యదల్చుకున్నా ఏదో ఒక సూత్రాన్ని నమ్మి ముందుకు జరగాలిగదా?" అన్నాడు మాసిన ఒకటి - కొంచెం హుందాగా.

"ఆ లెక్కన అదే సూత్రాధారంగా సరీగా మనం నుంచున్నది వంట గది పక్కనే అని నేను గంట వాయించి చెప్పగల్ను!" ప్రస్తుతం నడుస్తున్న వరస క్రమం పరిశీలిస్తుంటే ముందు మనకు సుష్టుగా భోజన ప్రాప్తి తప్పేట్టులేదు! యిదిగో యీ నీళ్ళగొట్టం చూశావా! ఒక్క వంటగదులకే యిలాంటి పెద్ద గొట్టాలుంటయ్!" అన్నాడు మాసిన రెండు.

"భగవాన్, యీ తిమ్మరాజును నాకు జంటగా పంపావా? యిదిగో నేస్తం, మనం యింతకుముందే అదృష్టవశాత్తు ఆ ధన మదంతో బలిసిన కుక్కలబారి నుండి తప్పించుకు బయటపడ్డాం! కాని అసలు నిజానికి యీ కుక్క రక్షకుల మీద ఆధారపడే కొందరు జాతకులు వాట్ని రాత్రిళ్ళు సహం డొక్కలు మాడ్చి కాపలాకు వొదుల్తార్ట! ప్రస్తుతం నీకు తట్టే ఆలోచనలు చూస్తే యీ సారైనా ఆ డొక్కలు మాడిన కుక్క రక్షకుల బారినుండి మనల్ని నువు తప్పించలేవని నా అంచనా-ఏమంటా?" అన్నాడు మాసిన ఒకటి నిట్టూరుస్తూ.

ప్రస్తుతం నడుస్తున్న ధోరణినిబట్టి మన కిలాంటి విపత్తులు రావని నా అంతర్వాణి చెపుతున్నది. అయినా నీ మాట లింటానికీ నా కెట్టి అభ్యంతరం లేదు- 'ధనమూల మిదం జగత్' అనంటారు! పద ఆ డబ్బున్న ముందువేపు గదికి-" అన్నాడు మాసిన రెండు మాసిన ఒకటిని అనుసరిస్తూ.

యింటికి ఉత్తరానున్న ముందు గదివద్ద కొచ్చి నుంచుని అక్కడున్న తలుపును పరీక్షించారు, మాసిన మనుషులు.

మాసిన ఒకటి తలుపు దగ్గరకు వెళ్ళి కాసేపు అటూ యిటూ తడివి- నిశ్శబ్దంగా దాన్ని తెరిచాడు.

"మహానుభావా, యీ సాధన ఎన్నేళ్ళుగా వుంది మనకూ? నాకు మతి పోయింది, నీ పనితనం చూసి!" అన్నాడు మాసిన రెండు, తెరిచిన నోరు అలాగే వుండిపోయి.

"నా పనితనానికి నాకే గుండె ఆగినంత పనవుతే- నువొక లెక్కేమిటి?" అన్నాడు మాసిన ఒకటి, తనకు తను ముగ్ధుడవుతూ.

"యిదిగో నేస్తం ఒక చిన్నమాట. చట్టరీత్యా యీ చర్య నేరం కింది కొస్తుంది, మరి నీ మనసుకు నీ కెట్టా వుంది?" అడిగాడు.

"చంపేశావు - నాకీ చట్టాలుంటయి అనే మాట తట్టలేదు! మన తర్కంలో యీ చట్టం ప్రసక్తి రాకపోవటం వింతేమరి! అయినా మనం యిక్కడ కొచ్చే ముందు ధనాధికుల వద్ద వినియోగంలో లేకుండా పడుండే నిలువ సొమ్ములో - కొంత మన తక్షణావసరాలకు వాడుకోవచ్చునే- నిర్ణయంమీదే యిక్కడ కొచ్చాం గదా! కాని 'చట్టం-నేరం' అనే విశేష పదాలు ఎటుగా మొగ్గినా మొగ్గేతత్వం గలవి! మనం దర్శించబోయే ధనంగల యీ యింటి ఆసామి చట్టాతీతుడనేం దాఖలా లుండక పోవచ్చు! అయినా చట్టం ఆయన్ని దాటిపోవచ్చు. అప్పుడు మనం-అలా దాటిపోవటం-చట్ట ప్రక్రియల్లో అదోరకం 'లీల' అనుకోవచ్చు! కానీ చట్టం తన మనం మటుకు పడవచ్చు! గనుక మనం స్వల్పంగా అంటే కేవలం స్వల్పావసరాల దృష్టితోనే-మనపని ముగించుకుని యిక్కణ్ణుంచి ఎంత తొందరగా బయటపడ్తే అంత ఆరోగ్యం-పద గదిలోపలికి-" అన్నాడు మాసిన ఒకటి, మాసిన రెండు చెయి పుచ్చుకుని చప్పుడు కాకుండా ఆ గదిలోకి ప్రవేశిస్తూ.

ఆ గదిలో మాసిన మనుషుల కాళ్ళు కాస్త స్థిరపడి, నాలుగు మూలలకు చూసి ఏది ఏమిటనే నిర్ణయాని కొచ్చేందుకు కొంచెం వ్యవధి పట్టింది.

"నేస్తం యీ గది నీ కళ్ళకు ఏమిగా కనుపిస్తున్నది!" అడిగాడు మాసిన ఒకటి.

"నా కళ్ళకు దోష గుణమేదీ తగలకపోతే యిది వంట గదల్లే కనుపిస్తున్నది!" అన్నాడు మాసిన రెండు, కళ్ళు నలుపుకుని చూస్తూ.

"ఈ యింటి వాళ్ళు శాస్త్రోల్లంఘన చేయగలరని నేను నమ్మలేదు. మన ప్రసిద్ధ వాస్తు శాస్త్ర రీత్యా ముందు మనం వొచ్చిన మూల యీశాన్యంగా యీ వంటగది వుండ వలసింది. ఇక్కడ వుండటం కేవలం అవివేకం. దురాగతమూనూ!" అన్నాడు హతాశుడైన మాసిన ఒకటి.

"కాదు, యీ సంఘటన కేవలం మన యోగం అంటాను! దీన్నే 'భగవదేచ్ఛ' అని నువంటే నేను నీతో తర్కించను. ముందు నువు కాలం విలువ గమనించి అక్కడ బాసీపెట్ వేసుక్కూచుంటే - మనిద్దరి వడ్డన్ల గురించిన పన్లు, మిషను ఆడించినట్టు ఆడించడం విషయం నాకొదిలేయ్" అని చక చక ఆ వంటగదిలో ఎక్కడ ఏమూల ఏ పదార్థాలున్నయో-తనకు కరతలా మలకమైనట్టు-విస్తళ్ళు, మంచి తీర్థం, పుష్కలంగా మిగిల్న వంటకాలు, మర్నాటికి తోడుపెట్టిన పెరుగు, నెయ్యి, వుప్పుతో సహా వడ్డన్లు ముగించి-యింకా నిస్పృహలో వున్న మాసిన ఒకటి ప్రక్కన కూచున్నాడు మాసిన రెండు, పరిపూర్ణమైన తృప్తితో.

"వూ, ఉపక్రమించు! మిగతా మన ముందున్న కార్యక్రమానికి పుష్టినిచ్చే అమృత ప్రసాదం. హర హర మహాదేవ!" అని ఔపాసన పట్టాడు, మాసిన రెండు.

"నీ అల్పసంతోషం నూరేళ్ళు వర్థిల్లుగాక!" అని మాసిన ఒకటి మాసిన రెండును దీవిస్తున్న సందర్భంలో- "దొంగలు-దొంగలు"! అని కొన్ని కంఠాలు అరవటం వంటగది ఎలక్ట్రిక్ లైట్ టప్న వెలగడం - ఏకకాలంలో జరిగిపోయినై.

ఆ వెలుతుర్లో మాసిన మనుషుల కెదురుగా నుంచుని వరసక్రమంలో కనుపించింది - రిటైరైన షష్ఠిపూర్తిలో వున్న యింటి పెద్ద, ఆయన పక్కన యాభై ఏళ్ళ భార్య, వాళ్ళిద్దరకూ రెండుపక్కలా రెండు దుడ్డుకర్రల్తో నుంచున్న పాతిక, ముప్పయ్యేళ్ళ యిద్దరు కొడుకులు, కుడి, ఎడమ రెండుపక్కల్న వారి యిద్దరు భార్యలు, వాళ్ళముందు మొగపిల్లలు, ఒక ఆడపిల్ల - యావత్ కుటుంబం గ్రూపు ఫోటోకు నుంచున్నట్టు- నుంచున్నారు.

"ఏమిటి మీరు చేస్తున్నది?" రిటైర్డు ఆఫీసరు గొంతుతో అడిగాడు యింటి పెద్ద.

"ఇప్పుడే భోజనాని క్కూచున్నాం!" అన్నాడు మాసిన ఒకటి, నిటారుగా కూర్చుని.

"ఆకలేసి యిలా చేయాల్సొచ్చింది- మీ కభ్యంతరం వుంటే చెప్పండి- మా దార్న మేం పోతాం?" అన్నాడు మాసిన రెండు, గుండ్రటి కళ్ళతో.

"మీరు దొంగలు, ఎంత ధైర్యం మీకు? యింకా నయం - కళ్ళల్లో వొత్తులేసుకునుంటాం గనక బతికిపోయినాం లేకుంటే యింకేమన్నా వుందా?" అన్నాడు యింటి పెద్దకొడుకు, మాసిన మనుషుల్ని వినిపించుకోకుండా.

"నా కెందుకో ఎడంకన్ను అదిర్నట్టయి-తలుపు సందులోంచి-అనుమానంగా

చూద్దునుగదా-వీళ్లేదో యిక్కడ సవరిస్తుండం కంటపడి మిమ్మల్నందర్నీ లేపా!" అన్నాడు యింటి రెండో కొడుకు.

"నాన్నా, వీళ్ళు దొంగవాళ్ళా?" అడిగాడు ఒక పిల్లవాడు.

"నోరు మూసుకునుండు వెధవాయ్-వాళ్ళదగ్గర కత్తులు కఠార్లుంటయ్, బొడ్లల్లో" అన్నది ఒక కోడలు, ఆ పిల్లవాణ్ణి దగ్గిరకు లాక్కుంటూ.

"అమ్మా నాకు భయమేస్తున్నదే!" అన్నది ఆడపిల్ల, రెండో కోడలు వెనక్కు వెళ్ళి తొంగిచూస్తూ.

"అన్నయ్యా, నువు ఫోను చేస్తావేంటి?" అన్నాడు యింటి రెండో కొడుకు.

"వీళ్ళ ధోరణి నాకు గిట్టటంలేదు-మనం వొచ్చిన తలుపు తెరిచే వుంది-" రహస్యంగా అన్నాడు మాసిన ఒకటి, మాసిన రెండుతో.

"నీ కన్న ముందే నేను రెడీ-నాకు మరీ అసహ్యంగా వున్నారు వీళ్ళు-" అన్నాడు రహస్యంగా మాసిన రెండు.

"వాళ్ళు గుసగుస లాడ్తున్నారు" అన్నది ఒక కోడలు.

"పోలీసులకు ఫోను చేయండ్రా మీ తెలివి మండా!" అన్నది తల్లి.

"ఏడ్చార్లే వెధవాయిలు! మా దగ్గర దుడ్డుకర్ర లున్నాయిగా వేషాలేస్తే! అయినా మంచిది, పోలీసులకు నువు ఫోను చేయరా తమ్ముడూ-" అని యింటి పెద్ద కొడుకు అంటున్నాడో లేదో- 'టక్'న వంటగది 'స్విచ్ ఆఫై' లైటు పోవటం- ఎక్కు పెట్టివున్న బాణం వొదిల్నట్టు-యిద్దరు మాసిన మనుషులూ తెరిచున్న వంటగది తలుపుగుండా ఒకే గంతులో బయటకుదూకి పరుగెత్తటమూ కనురెప్పపాట్లో జరిగిపోయినై చీకట్లో యింటి కుటుంబం గీగామంటుంటే-

"దొంగల్దొంగలు!" సప్తస్వరాల్లో అరిచారా చీకటి గదిలో కుటుంబం-తెప్పరిల్లుకుని.

"దొంగల్దొంగలు!" అనరిచారు పక్కింటివారు ఎవరో తన్నినట్లు మంచాల మీద నిటారుగా లేచి కూచుంటూ.

ఎప్పుడు-ఎక్కడ-పోనీకండి-పట్టుకోండి నిద్దర్లోనే అరిచారు యింకో పక్కింటివారు.

"స్వీట్లు, కేకులు తినమరిగి బలిసిన రెండు కుక్కలూ 'బౌ బౌ' మన్నాయ్. ఆ వార్త అత్యవసరంగా అందిపుచ్చుకుని 'బౌ బౌ' మన్నయ్ వీధి కుక్కలు".

కాంపౌండు గోడదూకి సందులు గొందుల్లో పడి పరుగెత్తారు చీకట్లో, మాసిన మనుషులు.

"వెర్రి వెధవాయిలు-వాళ్ళు మనం దొంగలం అనుకున్నారు-" అన్నాడు మాసిన రెండు పరుగెత్తుతూ.

"మనం నిజం దొంగలమైతే వాళ్ళు గడపదాటి బయటి కొచ్చారంటే నేను గుండు గొరిగించుకుని గోచీతో యీ వీధిలో వాళ్ళముందరే తిరుగుతా" అన్నాడు మాసిన ఒకటి పరుగెత్తుతూ.

"అందుకే యీ అవకాశం వాళ్ళకు గారెలు, బూరెలు, పాయసం తిన్నట్టుగా వుండి కులాసాగా మన వెంటపడ్డారు. యిదుగో యీ సందుమూల గుడిసె లేవో వున్నయ్-దేంటోనన్నా దూరుదాం పద-" అన్నాడు మాసిన రెండు, వుసి తగ్గిస్తూ.

రాత్రి అంత పొద్దుపోయినా జారవేసున్న ఆ గుడిసె తలుపు గమనించి- తోసి లోపలకు చేరి తలుపు మూసి- రొప్పుతూ నుంచున్నారు మాసిన మనుషులు, ఏ క్షణానైనా కండలు తిరిగిన ఏ రైతో పొన్నుకర్రతో తల పగలగొట్టచ్చనుకుంటూ.

ఆ గుడిసెలో ఓ కొయ్య సెమ్మె మీదున్న కిరసనాయిలుబుడ్డి దీపం పక్కన యీతాకుచాప మీద దుప్పటి కప్పుకొన్నా చున్న ఓ ముసలి అవ్వ తమను చూస్తుంటం కొంచెం నెమ్మదిగా గమనించారు, మాసిన మనుషులు. అక్కడ యింకేమూలా పొన్నుకర్రతో పొంచివున్న ఏ రైతూ వాళ్ళ కళ్ళముందర ప్రత్యక్షం కాలేదు.

"మేం నీ బిడ్డలం అనుకో - మమ్మల్ని కాపాడు" అన్నారు మాసిన మనుషులు, మూసిన తలుపువద్దే చతికిలపడి రొప్పుతూ.

"ఎవరు నాయనా మీరు?" అడిగింది అవ్వ, నిండుకుండల్లే.

"నువేమనుకున్నా - మేం దొంగలం మటుకు కాదు!" అన్నాడు మాసిన రెండు రొప్పుతూ.

"నే ననుకోవటంలేదు నాయనా! అయినా, పీక్కుదింటానికి మాకాడ ఏం వుంటందని మీ రొత్తారు?" అన్నది అవ్వ.

ఆ అవ్వ వయసు మళ్ళిన ఒక దేవతల్లే కనుపించింది మాసిన మనుషులకు.

"మేం దొంగలం అనుకుని మా వెంట పడ్డారు, అక్కడ వాళ్ళెవరో-" అన్నాడు మాసిన రెండు.

"ఎవరో లగెత్తుకొత్తుండారు– కూసేపు మాట్టాడకుండా ఆడేకూకోండి, ఆళ్ళదార్న ఆరే పోతారు!" అన్నది అవ్వ, బయట మనుషులు పరుగెత్తడం వింటూ.

"మమ్మల్ని రక్షించావు! నీ రుణం ఎలా తీర్చుకోవాలో మాకు తెలియటం లేదు అవ్వా!" **అన్నాడు మా**సిన రెండు - బయట నిశ్శబ్దం స్థిరపట్టం గమనించి.

"యింతమాత్రానికి రునాలెందుకులే నాయనా! ఎవరి పిల్లలు మీరు? ఎందుకట్ట గెడ్డాలు పెంచుకుండారు? మీ ఒల్లు, గుడ్డలు అంత మాసుండయ్యేం? మీరు కూడు తిన్నట్టు లేదే నాయనా పీక్కుబోయి వుండారు?" అడిగింది అవ్వ.

"నిన్నిలా యీ మధ్య ఎవరైనా అడగటం విన్నట్టు నీ కేమైనా జ్ఞాపకం వుందా?" మెల్లిగా మాసిన ఒకటిని అడిగాడు, మాసిన రెండు.

"లేదు!" అన్నాడు మాసిన ఒకటి తెప్పరిల్లుకుని.

"నీ మాటలు వింటుంటే మాకు పోయిన ప్రాణం తిరిగొచ్చినట్టుగా వుంది అవ్వా!" అన్నాడు మాసిన రెండు.

"నాకూ బిడ్డలుండారు, నాయనా! ఆళ్ళూ మీ కొచ్చిన యిల్లాటి సిక్కుల్లో పడరనేంటి? యిద్దరు కొడుకులూ యిద్దరు కోడళ్ళుండారు నాకు. నా బిడ్డలూ కోడళ్ళూ కలిసి యీడకు రెండు మైళ్ళదూరంలో వుండ పుగాకు ప్యాక్టరీలో పన్జేసుకుంటారు. యియాల సందేల "డూటీ" అవటాన ఆళ్ళు కొంపకు సేరేలికి తెల్లారి ఏ మూడు గంటలో అవుద్ది. నాకు కునుకుపట్టుద్దని తలుపు దగ్గిరకేసి వుంచా. మిమ్మల్ని సూత్తావుంటే కాత్తె సదువుకుండ పిల్లకాయల్లాగుండారు - నే నెప్పుడూ సదువుకుండోర్తో మాట్టాడెరగను!" అన్నది అవ్వ.

"అవ్వా, మేం బాగా చదువుకున్నవాళ్ళం కావటం నిజం. కాని నువూ నీ కొడుకులు, కోడళ్ళుకన్న మా చదువులు ఎక్కువని నువనుకోవద్దు. మేం చదువుకుని వుద్యోగాలూ దొరక్క, నీ కొడుకుల్లాగా కాయకష్టం చేసుకునే మనసూ లేక యిటు హీనంగా దొంగతనానికి పనికిరాక - ఎక్కడా చెల్లని మాసిన బతుకులైనై! మాకూ కుటుంబాలున్నా మీ కుటుంబానికున్న నీతి మిగులైనది! నీ కొడుకులు, కోడళ్ళు కష్టం చేసి నిన్నూ, తమనుకూడా పోషించుకుంటున్నారు. ఆ అదృష్టం మాకు కలగటంలేదు– కోరికలున్నా!"

"మా చదువులు కోరికలు పెంచుకుంటానికీ, దొరకని వుద్యోగాల కోసం దేవులాడే సరిహద్దుల్ని దాటలేనందుకే వుపయోగిస్తున్నాయ్".

"ఒకళ్ళింటో తినగా మిగిలిపోయిన మంచి ఆహారం దొరికింది మాకు! బహుశా ఆ యింటి వారెవరికో విందు చేసుంటే అవి మిగిలుండవచ్చు. అదీ మా అదృష్టంకొద్దీ

ననుకుని తింటానికి కూచున్నామో లేదో - మమ్మల్ని కనిపెట్టిన ఆ యింటివారు 'దొంగల్దొంగ'లని కేకలు పెట్టి మా వెంట పడ్డారు."

"అవ్వా, మేంనీకు వొరగపెట్టిందేం లేదు! పైగా మే మిక్కడికి దొంగతనానికి రాలేదని నీకు దాఖలా ఏం లేదు! నిజానికి నువ్వూ, నీ పిల్లలూ పాతికో పరకో కూడపెట్టుకున్నవి మేం దొంగలిస్తే చాలు మీ ప్రాణానికి! కాని మేము ఎంత హీనస్థితిలో మాసివున్నా, మా మొహాలు నీకు దొంగమొహాల్లాగా కాక చదువుకున్న వాళ్ళ మొహాలల్లే కనుపించినై! కాని యిదే రాత్రి యింకో చదువు సంస్కారాలుండి పెద్ద అంతస్తులో వున్న వారింటో వారు తినగా మిగిల్న ఆహారం తిన ప్రయత్నిస్తుంటే చూసినవారికి మా మొహాలు దొంగమొహాలుగా కనిపించినై మరి" అన్నాడు మాసిన రెండు.

"మడుసుల మొగాల్లోనూ, మాటల్లోనూ వాళ్ళతీరు కనిపిచ్చుద్దిలే నాయనా? నా పిల్లలు వొచ్చే యాల అయింది. ఏమో నాయన, వాళ్ళ బతుకూ దినగండం నూరేళ్ళాయిసుగా వుంది మీకుమల్లేనే! ఆళ్ళ కియాల్చిన కూలిడబ్బుల్లో ఒక వొంతు లంచం దిని మిగిల్న రెండొంతులే సేతిలో పెడ్తుండారంట. మరిదేందో యీ మద్దె 'యిదన్నాయం' అని రెండుసార్లు సమ్మె సేశారు! అందుకని కచ్చలు పెరిగి నడమంత్రంగావుందంట ప్యాట్రీలో యవారం! బెదిరిస్తాపోతే తీసి కొత్తార్ని పెడుతున్నారు-కాత్తె జాగర్తగా వుండమనం గాని పిల్లగాళ్ళు నా మాట యినరు నాయనా! పిల్లకాయలకు వంటచేసి పెట్టుంచా! అది మీరు తింటామంటే కాత్తె పోయిమీన పడేశానంటే మీరు తినేలోపలే వుడికి ఆళ్ళకూ తయారుగా వుంటది-లెగవండి పొద్దుపోతావుంది" అన్నది అవ్వ, ఒక చెయిపోటీమీద లేస్తూ.

"యిదంతా ఎలావుంది నీకు" అడిగాడు మాసిన రెండును మాసిన ఒకటి రహస్యంగా.

"అవ్వ ఆ వొడ్డిస్తున్న తిండికన్న ముందు మన బుద్ధికి తగినంత గ్రాసం యిక్కడ దొరికిందనుకుంటున్నా!" అన్నాడు మాసిన రెండు, అవ్వను పరీక్షగా చూస్తూ.